సాక్షి
హైదరాబాద్ । సోమవారం । 5 । ఆగస్టు । 2024

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈనెల 21వ తేదీన చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలకు కట్టుబడి ఈ తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్‌ను అమలు చేయాలనే కుట్ర ఈ తీర్పు వెనుక దాగి ఉందన్నారు. మొత్తం రిజర్వేషన్లనే రద్దు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆయన ఆరోపించారు.

◆ పార్లమెంట్, భారత రాష్ట్రపతి ప్రమేయం లేకుండా ఉద్దేశ పూర్వకంగా ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా జరిగిందన్నారు. ఆర్టికల్ 14,15,16లను వక్రీకరిస్తూ ఈ కేసులో తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు లేని అధికారాలు, సుప్రీంకోర్టుకు లేని అధికారాలను ఉపయోగించి ఈ తీర్పును కాంగ్రెస్ సహకారంతో ప్రధాని నరేంద్రమోదీ తీర్పు చెప్పించారని అన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ ఇచ్చిన తీర్పును మొత్తం యావత్ దేశంలోని ఎస్సీ, ఎస్టీ, దళిత సమాజం వ్యతిరేకిస్తుందన్నారు.

◆ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న దేశ వ్యాప్తంగా భారత్ బంద్‌కు దళిత బహుజన సంస్థలు, పలు రాజకీయ పార్టీలు, ఉద్యమ, సామాజిక, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ పీఎల్ రాజు, జేఎస్ రావు, బండి ఈశ్వర్, జొన్నలగడ్డ భాస్కర్ రావు, సిలివేరి వసంత్‌రావు, ఉప్పాడ శ్రీరామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ పేరు మార్పు తగదు

ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి ఎల్.వీ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం ఎంత మాత్రం సబబు కాదని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి ఎల్.వీ కుమార్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణకు చేసిన సేవలు చిరస్మరణీయమే కానీ..పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సురవరం పేరును వేరే కొత్తగా ఏర్పాటు చేసే వర్సిటీలకు పెట్టుకోవాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఆరాధ్యుడైన పొట్టి శ్రీరాములును గౌరవించడం మనందరి బాధ్యత అని ఎల్.వీ కుమార్ పేర్కొన్నారు. పేరు మార్పు ఆలోచనను విరమించకుంటే వైశ్య సంఘాల తరపున ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఢిల్లీలో జరిగే మహాధర్నా, పార్లమెంట్ భవన్ ముట్టడి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బీసీలు వేలాదిగా తరలి వస్తున్నారని పేర్కొన్నారు. బీసీల బడ్జెట్ రూ.2లక్షల కోట్లకు పెంచాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్‌పై శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న విద్యాధికారులు

చాదర్‌ఘాట్: కోవిడ్ అనంతరం ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు తగ్గినట్లు పలు సర్వేలలో వెల్లడైంది. ఈ క్రమంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించి మరింత రాణించే దిశలో వారిని సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. ఇందులో భాగంగానే విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో వెనకబడుతున్నారు.. కారణం ఏంటి లాంటి అంశాలను తెలుసుకునేందుకు నవంబర్‌లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. విద్యార్థులను ఈ టెస్ట్‌కు సన్నద్ధం చేసే దిశలో ఇప్పటి నుంచే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించింది. మలక్‌పేట పరిధిలోకి వచ్చే 20 ప్రాథమిక, 10 ఉన్నత పాఠశాలల పరిధిలో 3, 6, 9 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు శనివారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పేరిట నిర్వహించనున్న ఈ పరీక్షకు రెండు విడతలుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడతలో శనివారం అంబర్‌పేట మండల పరిధిలోని 40 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధిస్తారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

తొట్టెల ఊరేగింపులు.. మొక్కుల చెల్లింపులు

ముషీరాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న బోనాల వేడుకలు

కవాడిగూడ: కవాడిగూడ ఆషాఢమాసం బోనాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొట్టెల నారాయణస్వామి ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తన నివాసం నుంచి భారీ తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. తొట్టెల ఊరేగింపు లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం, బండమైసమ్మ దేవాలయం, అడ్వకేట్ కాలనీలోని బాలత్రిపురసుందరీ దేవి ఆలయం, లిబర్టీ వద్ద ఉన్న నల్ల పోచమ్మ ఆలయం వరకు తొట్టెల ఊరేగింపు బ్యాండ్ మేళాలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, వివిధ పార్టీ నాయకులు టి.రవీందర్, శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్ రాజశేఖర్, వెంకటేష్, పరిమళ్‌కుమార్, ప్రభాకర్ గంగపుత్ర, పరశురాం పాల్గొన్నారు.

మారెమ్మ, పోచమ్మ దేవాలయంలో..

కవాడిగూడ: భవానీనగర్‌లోని మారెమ్మ, పోచమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కస్తూరి కిషన్, ఆలయ కమిటీ సభ్యులు బి. రాజు, గండయ్య, వేముల రాజు, కుమార్‌తో మహిళలు ఉదయం నుంచే పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ముగ్గుబస్తీ, ఉన్నికోటలోని అమ్మవారి ఆలయాల్లో సైతల బోనాల వేడుకలు కనుల పండువగా జరిగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గాంధీనగర్, దోమలగూడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సుందరయ్య పార్కులోని తెల్ల ఉప్పులమ్మకు..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులోని తెల్ల ఉప్పలమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, మేళతాళాలతో అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను కులమతాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో వాకర్ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని అభినందించారు. అనంతరం వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పి. రాజేంద్రప్రసాద్‌గౌడ్, కోశాధికారి ఎంఎన్‌రావు, రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి, ఎస్సీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కులో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



లోయర్ ట్యాంక్‌బండ్‌లో నారాయణ ఆధ్వర్యంలో భారీ తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు భక్తులు

నేటితో ముగియనున్న వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల కాటన్, సిల్క్, డిజైనరీ చీరలతో శ్రీనగర్‌కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ నేటితో ముగియున్నది. ఈ ప్రదర్శనలోని చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుభకార్యాలకు, పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంలో ఈ ఎగ్జిబిషన్‌ను 70 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

పోలీసుల చెంతకు తప్పిపోయిన బాలుడు



చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో బాలుడు

చాదర్‌ఘాట్: తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన ఓ బాలుడు పోలీసుల చెంతకు చేరాడు. చాదర్‌ఘాట్ పోలీసుల వివరాల ప్రకారం.. మలక్‌పేట మహరాజ్ హోటల్ వద్ద నాలుగేళ్ల బాలుడు రోదిస్తూ ఉండటాన్ని గమనించిన స్థానికుల ఫిర్యాదు మేరకు బాలుడిని పీఎస్‌కు తీసుకెళ్లి వివరాలు సేకరించారు. తన పేరు అజాన్, తండ్రి పేరు ముస్తబా అని మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడన్నారు. బాలుడి గురించి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

తల్లిపాల విశిష్టతపై 'ఫెర్నాండెజ్' ఉద్యోగుల వాకథాన్



వాకథాన్‌లో ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఉద్యోగులు

బంజారాహిల్స్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఫెర్నాండెజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కు వేదికగా ఆదివారం 'వాకథాన్' నిర్వహించారు. 'క్లోజింగ్ ది గ్యాప్.. బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఆల్' థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తల్లీబిడ్డ ఇద్దరికీ తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. తల్లిపాలు ఇవ్వడం, దాని ప్రాధాన్యతను తెలియజేయడం, తల్లులకు ఈ విషయంపై అవగాహన కల్పించడం, ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ వాకథాన్ కొనసాగింది. తల్లి పాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, సవాళ్లను వివరించే స్లోగన్స్‌తో పాటు తల్లిపాల అవగాహనను పెంపొందించే ప్లకార్డులను పట్టుకుని వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, సోషల్ ఇనిషియేటివ్స్ హెడ్ డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యానికి, తల్లుల సాధికారతకు తల్లిపాలు ఎంతో కీలకమన్నారు. తల్లిపాల శ్రేష్ఠత గురించి తెలియజేయడం మనందరి కర్తవ్యమన్నారు. నియోనాటాలజీ విభాగం హెడ్ డాక్టర్ తేజో ప్రతాప్ ఓలేటి మాట్లాడుతూ అందరి సమష్టిగా కృషి చేసి తల్లులు, వారి జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

ఉత్సాహభరితంగా 'మిలాంజ్-2024'

బంజారాహిల్స్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ప్రతిఏటా తాము ఇంటర్ స్కూల్ పోటీలను నిర్వహిస్తున్నామని ఇవి వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయని పాఠశాల ఫౌండర్, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని మెరీడియన్ స్కూల్‌లో ఇంటర్ స్కూల్ కల్చరల్ కాంపిటీషన్ పోటీలు మిలాంజ్-2024 పేరుతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నగరంలోని 20 పాఠశాలలకు చెందిన సుమారు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొన్నారు. భరతనాట్యం, కూచిపూడి, కథక్‌తో పాటు పాశ్చాత్య నృత్యాలు, సంగీతం, వీధి నాటకాలు, మైమ్, కల్చరల్ డిబేట్, ఫేషియల్ ఫ్యాంటసీ, పద్యాల పోటీలు వంటి విభిన్న రకాల కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సెన్సార్ బోర్డు సభ్యురాలు, రచయిత డాక్టర్ శ్రీలేఖ కోచెర్లకోట ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ విద్యార్థులకు ఏ రంగంలో అయితే ప్రతిభ కనబర్చుతున్నారో అదేరంగంలో ప్రోత్సహించే మంచి గుర్తుంపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాణా తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు.. వాడవాడలా సంబురాలు



రోటరీకాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యాదగిరి, వెంకటేష్

కవాడిగూడ: సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సుప్రీంకోర్టు తీర్పును ఇవ్వడం సంతోషంగా ఉందని కవాడిగూడ రోటరీ కాలనీ అధ్యక్షుడు బండారి యాదగిరి, బీజేపీ నేతలు జి. వెంకటేష్, ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరశురాం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆదివారం బస్తీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. వర్గీకరణకు సహకరించిన అన్ని పార్టీల నేతలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, పరిమళ్‌కుమార్, మీసాల విఠల్‌రావు, గద్దె శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

మాకు రావాల్సిన బిల్లులు చెల్లించండి

పంజగుట్ట: గత సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఉచిత చేప పిల్లల సరఫరా చేసిన రైతులకు ఇంకా బిల్లులు రాలేవని వెంటనే బిల్లులు చెల్లించాలని తెలంగాణ చేప పిల్లల ఉత్పత్తి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన చేపపిల్లల ఉత్పత్తి రైతు, తెలంగాణ ముదిరాజ్ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి బొల్ల వెంకట్ ముదిరాజ్ మాట్లాడుతూ తాము 2023 – 24 సంవత్సరానికిగాను మత్స్యశాఖ ద్వారా పిలవబడిన టెండర్‌లో పాల్గొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపపిల్లల సరఫరా గత సంవత్సరం ఆగస్టు నుంచి నవంబర్ నెలలోపు పూర్తి చేశామని తెలిపారు. వాటి బిల్లు జనవరి మాసంలో రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని ఆయన పేర్కొన్నారు. చేపపిల్లల పెంపకం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, సరఫరాకు రవాణా ఖర్చులు అధికభారమయ్యిందని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన తమకు రావల్సిన బిల్లులు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమకు రావల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో 2024 – 25 సంవత్సరానికి గాను టెండర్ వేయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు.

'ది రెసిలెంట్ పాత్' పుస్తక ఆవిష్కరణ

బంజారాహిల్స్: అపోలో హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ హోం గ్రోన్ సీఈవో సుబ్రహ్మణ్యం యడవల్లి రాసిన తొలి పుస్తకం 'ది రెసిలెంట్ పాత్'ను హోటల్ దసపల్లాలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పుస్తకం మన జీవనానికి సంబంధించిన ప్రత్యేకమైన దృక్కోణాలను అందిస్తుందన్నారు. మార్పును స్వీకరిస్తూ.. వేగవంతమైన ప్రపంచంలో అభివృద్ధి చెందడం తెలుపుతుందన్నారు. ఇది మన బాహ్య వాతావరణం తాలూకా గందరగోళంలో సమతుల్యత, అంతర్గత సామరస్యాన్ని కనుగొనేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

వీఎస్‌ఐ ఆధ్వర్యంలో వాకథాన్

బంజారాహిల్స్: జాతీయ వాస్కులర్ డే సందర్భంగా అవయవ తొలగింపు నివారణ, రక్త నాళాల ఆరోగ్యం పట్ల అవగాహనకు వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా (వీఎస్‌ఐ) ఆధ్వర్యంలో ఆదివారం వాకథాన్ నిర్వహించారు. దుర్గం చెరువు లేక్ ఫ్రంట్ పార్కు వద్ద జరిగిన ఈ వాక్‌లో 350–400 మంది నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాస్కులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ చెవుటూరు మాట్లాడుతూ అవయవాలను కోల్పోవడానికి పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్ ప్రధాన కారణమన్నారు. ఇది గాయాల కారణంగా కోల్పోతున్న అవయవాలతో పోలిస్తే దాదాపు ఎనిమిది రెట్లు అధికంగా ఉంటుందన్నారు. వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ డాక్టర్ తపిష్ సాహు మాట్లాడుతూ అవయవ తొలగింపు రహిత భారతదేశం కోసం కృషి చేస్తూ, సమగ్ర వాస్కులర్ ఆరోగ్య సంరక్షణ కార్యాచరణను ఏర్పాటు చేయడం ద్వారా సమాజ ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పీసీ గుప్తా మాట్లాడుతూ వాస్కులర్ ఆరోగ్యం పట్ల నిబద్ధత, అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో సమష్టి కృషి అవసరమన్నారు.

OBITUARY



PATI SHERMISTA DEVI
DoB: 5.3.1933- Expired on 3.8.2024
W/o. Late Dr. P. Sudarshan Reddy.
Cremation on Tuesday, 6.8.2024 at 10:30 a.m. at Vaikunta Mahaprasthanam Crematorium (Jubilee Hills)
Son-Daughter-in Law
Sri P. Sandeep Reddy - Smt. Susan,
Daughter - Son-in-Law:
Smt. G. Anuradha - Dr. G. Sudhakar Reddy
Grand Daughters & Family Members

'జైల్ అదాలత్'లో 40కేసుల పరిష్కారం

చంచల్‌గూడ: చంచల్‌గూడ పురుషుల జైల్లో శనివారం రాత్రి వరకు నిర్వహించిన జైల్ అదాలత్‌లో 40 కేసులు పరిష్కారమైనట్లు సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్ అదాలత్‌లో హైదరాబాద్ నాంపల్లి జడ్జిలు అజేష్‌కుమార్, కుమార స్వామి, రాజు, సంతోష్‌కుమార్, అబ్దుల్ జావేద్ కేసులను పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసులు అదాలత్‌లో ప్రవేశపెట్టగా అందులో 40 కేసులను పరిష్కరించారు. కేసులు పరిష్కారమైన వారిలో 32 మంది విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్‌రెడ్డి, దేవ్లా, జైలర్లు జలంధర్, దేవ్‌సింగ్, అచ్చయ్య, తిరుమల్‌రెడ్డి, మధు, రామకృష్ణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'బహుజనుల కోసం పోరాడేది బీఎస్పీ మాత్రమే'

ఖైరతాబాద్: బహుజనుల కోసం ఎల్లప్పుడు పోరాడేది, పోరాడుతూనే ఉండేది బీఎస్పీ మాత్రమే అని బీఎస్పీ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అశోక్ సిద్ధార్థ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ పార్టీ సమావేశంలో సిద్ధార్థ్ మాట్లాడుతూ బహుజనుల సామాజిక స్థితిగతుల గురించి మాట్లాడుతూ నాడు కాన్షీరాం, మాయావతి ఎటువంటి పదవులు ఆశించకుండా కేవలం బహుజనుల శ్రేయస్సు లక్ష్యంగా కేంద్రంలో ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. ఇది అణగారిన కులాల పట్ల వారి నిబద్ధత తెలుపుతోందని, మళ్లీ నేడు కులాల వారీగా చీలిన ప్రాంతీయ పార్టీలు, అటు మతవాదంతో బీజేపీ, ఇంకోవైపు కాంగ్రెస్‌తో ఒరిగేది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ, బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్ర రావు, తెలుగు రాష్ట్రాల ఇతర కార్యవర్గ నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా బాలికల కన్వీనర్‌గా భవాని

దిల్‌సుఖ్‌నగర్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) సరూర్‌నగర్ మండల అధ్యక్షురాలిగా పనిచేస్తున్న ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన బాతరాజు భవాని, ఆదివారం రాజేంద్రనగర్ నగరంలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నిర్మాణ కౌన్సిల్లో ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి, గర్ల్స్ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. ప్రభుత్వ కళాశాలలు, హాస్టల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా నియమించిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చంచల్‌గూడ: మలక్‌పేట సివిల్ సప్లై అధికారులు శనివారం నిర్వహించిన దాడుల్లో 17 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సౌత్‌ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో చావణి గుడ్డిబౌలీలో మహ్మద్ సాజీద్ (50) అడ్డాల్లో దాడులు నిర్వహించగా బ్లాక్ మార్కెట్ తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాన్ని పట్టుకోగా అందులో 17 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం లభించాయి. వివిధ ప్రాంతాల నుంచి బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు వాహనాన్ని మాదన్నపేట పోలీసులకు అప్పగించారు.

మహాలక్ష్మి, గృహజ్యోతికి దరఖాస్తుల వెల్లువ

కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదని స్పష్టం చేసిన అధికారులు

- ప్రజాపాలన దరఖాస్తు పత్రాలు సమర్పించాలని సూచన
- వార్డు కార్యాలయాల్లోనూ దరఖాస్తుల స్వీకరణ



ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు..

బంజారాహిల్స్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టేందుకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా గ్యాస్ సబ్సిడీ, మహాలక్ష్మి పథకం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం (గృహజ్యోతి పథకం)లో భాగంగా ప్రజాపాలన కౌంటర్లలో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న చాలామంది వాటికి సరైన పత్రాలు సమర్పించకుండా ఉండడంతో ఈ పథకాలకు అనర్హులయ్యారు. అర్హత ఉండి కూడా సరిగ్గా దరఖాస్తు చేసుకోని కారణంగా గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి 200 యూనిట్ల లోపు విద్యుత్ పథకాలకు దూరమయ్యారు. దీంతో గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు అర్హులైన వారందరూ సరైన పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో సర్కిల్ కార్యాలయాల్లో మరోసారి సంబంధిత పత్రాలను జతచేసి దరఖాస్తులు అందజేశారు. సరిగ్గా వీటి స్క్రూటినీ జరుగుతున్న సమయంలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డురావడంతో అప్పుడు దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయి మరోవైపు తీసుకున్న వారి దరఖాస్తులను కూడా స్క్రూటినీ చేయలేకపోయారు. దీంతో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హత ఉన్నా సరే తమకు లబ్ధి చేకూరడం లేదని గత కొంతకాలంగా చాలా మంది సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత జులై 22వ తేదీ నుంచి ఆయా సర్కిల్ కార్యాలయాల్లో, వార్డు కార్యాలయాల్లో అభయహస్తం దరఖాస్తులను మళ్లీ స్వీకరిస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వస్తుండడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ డివిజన్లకు సంబంధించిన మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు సర్కిల్ కార్యాలయాల్లోనూ, వార్డు కా ర్యాలయాల్లోనూ ఏర్పాటు చేశారు. చాలామంది ఈ కౌంటర్లలో తమ దరఖాస్తులను అందజేసేందుకు బారులు దీరుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో కొన్ని అంశాలను ప్రస్తావించకపోవడం, ఆధార్, రేషన్‌కార్డు సరిగ్గా లేకపోవడం తదితర లోపాలతో తిరస్కరణకు గురయ్యారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన ఫైల్ నెంబర్‌ను తాజాగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో చూపిస్తే సదరు అధికారి వెంటనే ఆ ఫారాన్ని తెరిచి వివరాలను నమోదు చేస్తారు.

10 నిమిషాల్లోనే ఆన్‌లైన్..

ప్రజాపాలనలో దరఖాస్తు చేసినప్పటి రశీదు, రేషన్‌కార్డు, కుటుంబ యజమానురాలి ఆధార్ కార్డు, 200 యూనిట్ల లోపు ఉన్న ఇంటి కరెంటు బిల్లు సమర్పిస్తే 10 నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో నమోదు పొందుపరుస్తున్నారు. వెంటనే ఆ రెండు పథకాలకు అర్హులుగా మారతారు. మళ్లీ ఈ సేవలను పునఃప్రారంభించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏ డివిజన్ కౌంటర్లు ఎక్కడంటే..

- వెంకటేశ్వరకాలనీ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు అభయహస్తం దరఖాస్తుల వివరాలను ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో నమోదు చేయవచ్చు.
- బంజారాహిల్స్ డివిజన్‌కు సంబంధించిన ప్రజలు తమ అభయహస్తం దరఖాస్తులను ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో అందజేయవచ్చు.
- జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ప్రజలు మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు సంబంధించిన వివరాల దరఖాస్తులను ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 కార్యాలయంలో అందజేయవచ్చు.
- షేక్‌పేట డివిజన్ దరఖాస్తులను షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో తీసుకుంటున్నారు.
- ఖైరతాబాద్ డివిజన్ ప్రజల దరఖాస్తులను శాఖా మైదానంలో ఉన్న వార్డు కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.
- సోమాజీగూడ డివిజన్ దరఖాస్తులను పంజగుట్ట ఆఫీసర్స్ కాలనీలోని జలమండలి కార్యాలయం వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.